క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుండుపల్లె మార్గంలో రోడ్డు మరమ్మతుల కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అంతరాయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె : జనవరి 1లోపు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న మాట్లాడుతూ 2024, జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు పూర్తి అయ్యే యువతీయువకులు ఆయా గ్రామాల పరిధిలోని పోలింగ్ బూతులలో ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు.

అమ్మవారికి ఆషాఢ మాస పూజలు



అమ్మవారిని గోరింటాకుతో అలంకరించిన దృశ్యం

చిట్వేలి : చిట్వేలిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోని శ్యామలాంబ అమ్మవారికి శుక్రవారం ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని గోరింటాకుతో ప్రత్యేకంగా అలంకరించారు. పురోహితులు సురేంద్రవర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించి మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు.

అమ్మవారికి రాహుకాల పూజ

రాయచోటిటౌన్ : పట్టణంలోని భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి అమ్మవారికి హారతులు పట్టారు. పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో జరిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పోలి ఎస్టీ కాలనీలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనగలపాటి చంద్రనాయుడు సహకారంతో శుక్రవారం విద్యా సామగ్రి(పుస్తకాలు, పెన్‌లు, పెన్సిల్‌లు, పలకలు)ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు రమణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నరసింహరాజు, టి.లక్ష్మినారాయణ, షేక్ అబ్దుల్లా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు

రైల్వేకోడూరు : లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖ అధికారి ఎం.వెంకట భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బొప్పాయి నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ నుంచి లైసెన్స్ పొందనివారికి, లైసెన్స్ రెన్యూవల్ చేసుకొని నర్సరీ యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న యజమానులకు ఉద్యానశాఖ అధికారి చేతులమీదుగా లైసెన్సులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

పోలీసులకు లైటింగ్ బోర్డు అందజేత



లైటింగ్ బోర్డును అందజేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు శుక్రవారం పట్టణంలోని పోలీస్ క్యాంటీన్‌కు లైటింగ్ బోర్డును అందజేశారు. క్లబ్ కోశాధికారి హరీష్‌చంద్ర ఆర్థికసహకారంతో క్లబ్ సభ్యులు బోర్డును తయారు చేయించారు. బోర్డును క్యాంటీన్ ఇన్‌చార్జ్ తిరుమలయ్యకు క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ హరినాథరెడ్డి, మాజీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, కార్యదర్శి ఇందాద్ అహమ్మద్, కోశాధికారి హరీష్‌చంద్ర, సభ్యులు రాజశేఖర్‌రాజు, వినోద్‌కుమార్, ఖలీల్, కానిస్టేబుల్ రమేష్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పాలనను ప్రజలకు చేరువ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సమస్యల పరిష్కార వేదికగా జగనన్న సురక్ష
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు



చిన్నమండెం: సర్టిఫికెట్లను అందజేస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి



రాజంపేట రూరల్: పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



సంబేపల్లె : లబ్ధిదారులకు ధృవపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రజలందరికి సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టినట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఊటుకూరు, కూచివారిపల్లి గ్రామ సచివాలయాల పరిదిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని.. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకు పాలనను చేరువ చేశారని తెలియజేశారు. అనంతరం జగనన్న సురక్షలో దరఖాస్తులు చేసుకున్న వారికి స్థానిక నాయకులతో కలిసి అర్హత పత్రాలను అందజేశారు. జగనన్న సురక్ష స్పెషల్ ఆఫీసర్ వీ.సాంబశివరావు, తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఎస్.ఫణిరాజకుమారి, ఎం.బాలమునిస్వామి, సర్పంచ్ పీ.ఈశ్వరయ్య, ఎంపీటీసీ నాగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : జగనన్న సురక్ష.. జనానికి భరోసా అని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వే కల్యాణ మండపంలో సర్పంచ్ జె.సూర్యనారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషా, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు సత్యప్రకాశ్, వైస్ ఎంపీపీ అనుదీప్, నడివీధి సుధాకర్, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సందర్శించారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సురక్షతో లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నరవకాటిపల్లి సచివాలయంలో సర్పంచ్ లక్ష్మినరసమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డితోపాటు గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు హాజరై లబ్ధిదారులకు 461 రకాల ధృవీకరణ పత్రాలను అందజేశారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నమండెం–1, దేవగుడిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నర సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్హులకు సర్టిఫికెట్లను దేవనాథరెడ్డి చుక్కా అంజనప్పతో కలిసి అందజేశారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

రాయచోటి అర్బన్ : క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఎక్కడికి అక్కడికే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని రాయుడుకాలనీలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, ఆర్వి మల్లికార్జున, డీఈ సుధాకర్‌నాయక్, టీపీఓ లక్ష్మి, ఏఈ క్రిష్టారెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం అర్హులకు సంక్షేమ పథకాలు – ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : వందశాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిపల్లెలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, వర్గ పార్టీలకతీతంగా, లంచాలకు, వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమంరాష్ట్రంలో మిగిలిన 1శాతం మంది ప్రజలకు కూడా పథకాలను అందించడంతోపాటు అవసరమైన సర్టిఫికెట్లను అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్డీఓ రంగస్వామి, ఎంపీపీ ఆవుల నాగశ్రీ లక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, డ్వామా పీడీ మద్దిలేటి, జెడ్పీటీసీ కవిత, రమేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సర్పంచ్ వెంకట్రమణ, ఎంపీడీఓ నరసింహులు, ఎంపీటీసీలు సీతక్క, రామరాజులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న జగనన్న సురక్షతో పేదలందరికీ రక్ష అని జేసీఎస్ కన్వీనర్లు ఖాదర్‌మొహిద్దీన్, వెంకటరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తూముకుంట, వెలిగల్లు గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని దరఖాస్తు చేసుకున్నవారికి కావాల్సిన ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబా ఫక్రుద్దీన్, ఎంపీటీ షాహన్‌వాజ్, తహసీల్దార్ దైవాదీనం, ఈఓపీఆర్డీ శేఖర్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, సచివాలయం కన్వీనర్లు ఆంజనేయులురెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న రైతులు

చిట్వేలి : మామిడి కోత అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం మైలపల్లి రైతు భరోసా కేంద్ర పరిధిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారిణి ఆషియా మాట్లాడుతూ మామిడి తోటలో జూన్ నుంచి అక్టోబర్ వరకు పాటించే సమగ్ర సాగు పద్ధతులపైనే దిగుబడులు ఆధారపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీ సావిత్రి, ఏఓ శ్రీఖర్, ఎల్వీ మోహన్ రెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సన్మానం

రాయచోటి టౌన్ : పదోన్నతిపై రాయచోటి నుంచి చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళుతున్న పీఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పురుషోత్తం రెడ్డిని ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాయచోటి డైట్ కేంద్రంలో పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డెన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. మునిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ హక్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ జక్రియా బాషా, హబీబుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని బజారు వీధిలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మేకపాటి నందకిశోర్‌రెడ్డి తండ్రి అయిన రిటైర్డ్ టీచర్ మేకపాటి నరసారెడ్డి(85) గురువారం తమ ఇంటిలోనే మృతి చెందడంతో శుక్రవారం కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఒంటిమిట్టకు చేరుకుని ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.

అంగన్‌వాడీలలో అవగాహన సదస్సులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు వారి తల్లులు

చిట్వేలి : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం ఆరోగ్యం, పారిశుధ్యం, పౌష్టిక ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో ప్రతినెల మొదటి, మూడో శుక్రవారాలలో గ్రామాలలో ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారంపై ప్రజలలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని 144 అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీఎం రాచపల్లిలోని గ్రేడ్–1 సూపర్ వైజర్ వసుంధరమ్మ, విశాలాక్షి, విజయకుమారి, సురేఖరాణిల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు.

ఆరోగ్యం, పౌష్టిక ఆహారంపై అవగాహన

పెనగలూరు : ఆరోగ్యం, పౌష్టిక ఆహారం, పారిశుధ్యంపై అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఏ.విజయకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టిక ఆహారాన్ని పెట్టాలన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మడగలంకు సన్మానం



మడగలం శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

పుల్లంపేట : పుల్లంపేట గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ మాల వెల్ఫేర్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డెరెక్టర్ మడగలం శ్రీనివాసులును సన్మానించారు. సచివాలయ కన్వీనర్ పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు సామా రాంబాబు, పోలిచర్ల సుబ్రమణ్యం, సిద్దారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు : పట్టణంలోని జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు చింతనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని కోరగా స్పందించిన కొరముట్ల రూ.20 లక్షలు కేటాయించారు. అలాగే పట్టణంలోని జగడంపల్లిలో శుక్రవారం సీసీరోడ్డు పనులకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట సాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, సుధాకర్‌రాజు, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి హైస్కూల్ హెచ్‌ఎంగా పురుషోత్తం రెడ్డి

చిట్వేలి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పి.పురుషోత్తంరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన లక్కిరెడ్డిపల్లె నుంచి బదిలీపై చిట్వేలికి వచ్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, ప్రజల సహకారంతో విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తామని చెప్పారు.

సంతాపం

ఓబులవారిపల్లె : మంగంపేట అయ్యపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కొలూరి నరసింహరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. అయ్యపురెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ముఖ్యమంత్రి సలహాదారులు ఆర్ ధనుంజయరెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. పంజం సుకుమార్‌రెడ్డి, గుత్తిరెడ్డి హరినాథరెడ్డి, కొలూరి నారాయణరెడ్డి, కొలూరి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందించే గడ్డి విత్తనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ డాక్టర్ జయప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరబల్లె మండలానికి 1000 కిలోల గడ్డి విత్తనాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో రూ.85కే అందిస్తోందని తెలిపారు. ఒకొక్క రైతుకు 5 కిలోల చొప్పున అందిస్తామని తెలిపారు.

లేఔట్ పనులు వేగవంతం చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

రాయచోటి అర్బన్ : పట్టణ శివార్లలో నిర్మాణంలో ఉన్న ఎంజీజీ లేఔట్‌లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తెలియజేశారు. పట్టణ శివార్లలోని ఎంజీజీ లేఔట్ పనులను ఆయన మున్సిపల్ అధికారులతో కలసి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. లేఔట్ కాంపౌండ్ వాల్, సిమెంటు రోడ్డు, డివైడర్లు, యూజీడీ పనుల పురగతిని పరిశీలించారు. పనులను ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం నక్కవాండ్లపల్లె వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న క్రికెట్ స్టేడియం పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, పబ్లిక్ హెల్త్ డీఈ సతీష్ కుమార్, ఏఈ సుబ్బరాయుడు, సైట్ ఇంజనీర్ ఎలవర్సన్, కాంట్రాక్టర్లు రియాజ్ అహమ్మ, రియాజుర్ రహిమాన్‌లు పాల్గొన్నారు.

మరిన్ని రైళ్లకు స్టాపింగ్ కల్పించండి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : ఇప్పుడు కల్పించిన రైళ్లకు తోడు మరిన్ని రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని డీయూఆర్‌సీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాజంపేట పార్లమెంటు పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని డీఆర్ఎం వెంకటరమణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తిరుమల ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ, అరక్కోణం రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. కొరారు పెంచలయ్య, సుబ్బయ్య, మందపాటి బాలసుబ్రమణ్యం, దమ్ము రఘు పాల్గొన్నారు.

కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా ముమ్మడి బాలిరెడ్డి

- గల్ఫ్ కో–కన్వీనరుగా గోవింద నాగరాజు



రాజంపేట : కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనరుగా ముమ్మడి బాలిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో మరోసారి కువైట్ కన్వీనర్‌గా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, ప్రభుత్వసలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, గ్లోబల్ కన్వీనరు మేడపాటి వెంకట్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ మిథున్ రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్): పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్షలో భాగంగా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగే విధంగా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందుకోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీపీ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి, వైద్యాధికారి వినయ్ బాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డాక్టర్ వేణుగోపాల్ రాజు

వీరబల్లె (రాయచోటి టౌన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో పరిసరాలు, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. సూపర్‌వైజర్ శివయ్య, హెల్త్ అసిస్టెంట్ నాగయ్య, ఏఎన్ఎం శిరీష, ఆశావర్కర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పట్టాలను ఇవ్వండి



దీక్షలో కూర్చున్న గిరిజనులు

రాయచోటి అర్బన్ : షికారుపాలెంకు చెందిన గిరిజనులకు భూ పట్టాలను అందించాలని కోరిన సమస్య పరిష్కారం కాకపోవడంతో గిరిజనులు ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, లంబాడా నేత శంకర్‌నాయక్‌లు మాట్లాడుతూ 1984 నుండి షికారుపాళెం చుట్టూ ఉన్న అటవీభూములను గిరిజనులు సాగుచేసుకుంటూ జీవించేవారన్నారు. గత కొన్నేళ్ళుగా సదరు భూములను సాగుచేయవద్దంటూ అటవీఅధికారులు గిరిజనులను అడ్డుకుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్య పరిష్కరించే వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతి ; ఎస్పీ గంగాధర్ నివాళి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

రాజంపేట : రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్ (మన్నూరు)లో హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన స్వస్థలం కడప కాగా, ఉద్యోగరీత్యా మన్నూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పెనగలూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతిపై మన్నూరుకు బదిలీపై వచ్చారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, రాజంపేట డీఎస్పీ చైతన్య, సీఐ పుల్లయ్య, ఎస్ఐలు భక్తవత్సలం, హేమాద్రి, ఏఎస్ఐలు సుబ్బరాజు, సుబ్బయ్య, మన్నూరు పోలీసులు, అన్నమయ్య జిల్లా అసోసియేషన్ సభ్యులు, పలువురు స్నేహితులు మృతుని ఇంటికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు.

చారిత్రాత్మకం జగనన్న అమ్మ ఒడి

– అమ్మఒడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : జగనన్న అమ్మ ఒడి పథకం చారిత్రాత్మకంగా నిలుస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నాల్గవ విడత జగనన్న అమ్మ ఒడి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ తల్లి తన బిడ్డలను బడికి పంపలేని పరిస్థితులు రాకూడదన్న ఉద్దేశంతో వరుసగా నాల్గవ ఏడాది అమ్మ ఒడి కార్యక్రమాన్ని జగన్ ప్రభుత్వం అమలు చేసినట్లు చెప్పారు. విద్యారంగానికి వైఎస్సాఆర్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా నాల్గవ విడత అమ్మ ఒడి ద్వారా 31,533 మంది లబ్ధిదారులు రూ.47,28,45,000 పొందినట్లు చెప్పారు. సంబేపల్లె మండలంలోనే 3,528 మంది విద్యార్థులు సుమారు రూ.5.29 కోట్లు లబ్ధి పొందారన్నారు. నాలుగేళ్లలో రాయచోటి నియోజకవర్గంలో అమ్మ ఒడి ద్వారా అందిన సాయం సుమారు రూ.200 కోట్లు అని ఆయన చెప్పారు. రాయచోటిలో త్వరలో పీజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దానిని యూనివర్సిటీ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సంబేపల్లె మండలానికి చెందిన 3,528 మంది విద్యార్థులకు గానూ రూ.5,29,20,000 మెగా చెక్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థుల తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓలు రమాదేవి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల జేసీఎస్ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు వి.వి.ప్రతాప్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.